క్లుప్తంగా

ఆధార్, పాస్‌బుక్‌తో రిజిస్టర్ చేసుకోవాలి

మిర్యాలగూడ : ఫార్మర్ రిజిస్ట్రీ, రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల పొందే ప్రతి రైతు తమ ఆధార్‌కార్డు, పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డుకు అనుసంధానమైన ఫోన్ తెచ్చుకోని ఏఈఓల వద్ద ఫార్మర్ రిజిస్ట్రి చేసుకోవాలని ఏవో ధీరావత్ సైదానాయక్ కోరారు. శుక్రవారం మిర్యాలగూడ రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ హైదరాబాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దేశంలోని ప్రతి వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రత్యేక యూనిక్ కోడ్ నంబర్ ఇవ్వడం కోసం ఈ కార్యక్రమం చేపడుతుందన్నారు. రిజిస్ట్రీ చేసుకున్న రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. లేని పక్షంలో నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓలు శివరాం, రుషేంద్రమ ణి, సరిత, కిశోర్‌నాయక్, ఏఈఓలు పాల్గొన్నా రు.

ఆస్తిపన్ను చెల్లింపునకు గడువు పెంపు

మిర్యాలగూడ టౌన్ : ఇంటి పన్ను ముందస్తు చెల్లింపునకు ఈనెల 7వ తేదీ వరకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం 5శాతం రిబేట్‌ను మరోసారి అవకాశం కల్పించినందున ఇంటి యాజమానులు, వ్యాపార, వాణిజ్య సంస్థల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అడవిదేవులపల్లి : వేసవి శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని మండల విద్యాశాధికారి వరలక్ష్మి కోరారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లలిత కళలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ వరకు నిర్వహించే ఈ ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 6 నుంచి 14 ఏళ్లలోపు విద్యార్థుల ఆసక్తిని బట్టి ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌తో పాటు పాటలు, చిత్రలేఖనం, నృత్యం వంటివి నేర్పించనున్నట్లు తెలిపారు. పార్ట్ టైం శిక్షకులు సురేఖ, రాము వ్యవహరిస్తున్నారన్నారు. విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలి

పెద్దఅడిశర్లపల్లి : ఉపాధిహామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బలాజీనగర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీకి బడ్జెట్ తక్కువ కేటాయించడం సరికాదన్నారు. ఆయన వెంట కావళి కృష్ణయ్య, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ దేవరకొండ మండల అధ్యక్షుడిగా రామునాయక్



దేవరకొండ : భారతీయ జనతా పార్టీ దేవరకొండ మండల నూతన అధ్యక్షుడిగా మండలానికి చెందిన రామునాయక్ నియా మకమయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి శుక్రవారం నియామకపత్రం అందజేశారు. నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

డిండి మండల అధ్యక్షుడిగా సింకారు సైదా



డిండి : పట్టణానికి చెందిన సింకారు సైదాను బీజేపీ మండలాధ్యక్షుడిగా, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా వావిళ్ల అంజి యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెతిపారు. తమ ఎన్నికకు సహరించిన ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి, దేవరకొండ నియోజకవర్గ కన్వీనర్ ఏటి.కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

దేవరకొండ : కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా జన గణనతో పాటు కుల గణన సైతం చేపట్టనున్నట్లు భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించడాన్ని స్వాగతిస్తూ దేవరకొండ మండలం తాటికోల్ గ్రామంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇడెం రవికుమార్ ఈ కార్యక్రమంలో కడ్తాల బాలస్వామి, ఛండీశ్వర్, తిరుపతిగౌడ్, హరి, నాగేందర్, కుర్మయ్య ఉన్నారు.

నిరుపయోగంగా నీటి తొట్లు

- నిర్వహణను పట్టించుకోని అధికారులు
- దప్పికతో అల్లాడుతున్న పశువులు
- నీటిని నింపాలని కోరుతున్న రైతులు

మాడుగులపల్లి : వేసవికాలంలో పశువులు, మేకలు, గొర్రెల దాహార్తిని తీర్చడానికి లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నీటి తొట్లు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ, వాటర్ షెడ్ పథకంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో నీటి తొట్లను నిర్మించారు. రెండేండ్ల క్రితం ప్రతి గ్రామంలో మూడు నుంచి నాలుగు నీటి తొట్లను నిర్మించారు. ఉపాధిహామీ పథకం ద్వారా ఒక్కో నీటి తొట్టిని రూ.12వేలతో నిర్మించారు. నిర్మించిన నీటి తొట్లలో చెత్తా చెదారం చేరి నిరుపయోగంగా మారగా కొన్ని నీటితొట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. చెరువుల్లో నీరు లేక తొట్లలో నీరు లభించక మూగ జీవాలు దప్పికతో అలమటిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో నీటి తొట్ల వద్దకు వచ్చిన పశువులు, మేకలు, గొర్రెలు నీళ్ల లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నాయి. దీంతో మూగజీవాలకు నీటి కష్టాలు తప్పడం లేదు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లోని నీటితొట్లలో నీటిని నింపి మూగ జీవాలకు నీటిని అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





ఇందుగులలో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్లు

పశువుల దాహార్తిని తీర్చాలి



మా గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద నీటి తొట్లను నిర్మించినప్పటికీ అందులో నీళ్లు పోయకపోవడంతో ఎండాకాలంలో పశువులు దప్పికతో అల్లాడుతున్నాయి. తొట్లలో నీళ్లు నింపాలని అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. వెంటనే అధికారులు స్పందించి తొట్లలో నీటిని నింపి పశువుల దాహార్తిని తీర్చాలి.

\- తవిటి సైదులు, నారాయణపురం

నిర్వహణ పంచాయతీలకు అప్పగించాం

ప్రతి గ్రామంలో నీటి తొట్లను నిర్మించాం. వాటి నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలకు అప్పగించాం. మరమ్మతులు ఉంటే చేయించుకోని గ్రామ పంచాయతీ సిబ్బంది ద్వారా నీటి తొట్లను నింపుకోవాలి. మూగ జీవాలకు నీళ్లందించేందుకు గ్రామ పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేస్తాం.

\- శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ, మాడుగులపల్లి

బంగారు మైసమ్మ జాతరకు ఏర్పాట్లు చేయాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, అధికారులు

మిర్యాలగూడ : దామరచర్లలో ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించే కల్లేపల్లి బంగారు మైసమ్మతల్లి జాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజులతో కలిసి జాతర ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌లు మాట్లాడుతూ బంగారు మైసమ్మతల్లి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకాలు జరుగకుండా అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ వేసవికాలంలో భక్తులకు దాహం తీర్చేందుకు తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. అదే విధంగా ఆలయం వద్ద పోలీసుశాఖ పగడ్బందీగా చర్యలు చేపట్టాలని, వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్లెపల్లి బంగారు మైసమ్మతల్లి ఆలయ పూజారులు, గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ జనార్దన్, ఆలయ ఈవో కొండల్‌రెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ దస్రు నాయక్, నెహ్రూ, ఎర్రనాయక్, పాచ్చునాయక్, లింగనాయక్, ధీరావత్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సభా ఏర్పాట్ల పరిశీలన

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకుగాను ఈనెల 4న సాయంత్రం పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంప్‌గ్రౌండ్‌లో నిర్వహించే సభ, సింగర్ మంగ్లీ ఆధ్వర్యంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి హాజరుకావాలని కోరారు. ఆయన వెంట పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు దేశిడి శేఖర్‌రెడ్డి, గోదాల జానకిరాం రెడ్డి, మేకల శ్రీనివాస్, గొట్టిముక్కల లక్ష్మణ్, సికిందర్‌బాష, పాతూరి శరత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : అర్హులైన ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన 205మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం దేశానికే దిక్సూచిగా మారిందని తెలిపారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు కాని విధంగా బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నో పథకాలకు శ్రీకారం చుట్టినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, అధికారులు, తదితరులున్నారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

అడవిదేవులపల్లి : తెలంగాణలో సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కుల గణనకు కేంద్రం అంగీకరించడం కాంగ్రెస్ పార్టీ విజయమని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో భాగంగా సామాజిక అసమానతలు తొలగించడం కోసం దేశ వ్యాప్తంగా కులగణను చేపట్టాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి నాయత్వంలో తెలంగాణ ప్రభుత్వం కుల గణనను చేసి దేశానికి ఒక దిక్సూచిగా నిలిచిందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని రోల్‌మోడల్‌గా చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. పట్టణ, మండల, జిల్లా పార్టీ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దేశ సంపద మొత్తం అందరికీ చేరాలని కోరుకుంటుందన్నారు. దేశంలోనే మొదటి సారిగా తెలంగాణ రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్న బియ్యం అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు బాలునాయక్, వెంకటేశ్వర్లు, కోమ్ముదాసు, తులస్య, రవి, వెంకయ్య పాల్గొన్నారు.

వైద్యుడి నిర్లక్ష్యంతో బాలుడు మృతి

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న బంధువులు

మిర్యాలగూడ అర్బన్ : వైద్యుడి నిర్లక్ష్యంతో బాలుడు మృతిచెందాడని ఆస్పత్రి ఎదుట బంధువులు ఆందోళన చేస్తున్న ఘటన మిర్యాలగూడలోని డాక్టర్స్ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా గారెకుంటతండా కు చెందిన శంకర్, శ్రీలత దంపతులకు చెందిన 7నెలల బాలుడు లావ్యాన్స్ తీవ్ర జ్వరం రాగా పట్టణంలోనిఓ ప్రైవేట్ పిల్లల వైద్యశాలకు గురువారం తీసుకొచ్చారు. బాలుడిని పరీక్షించిన పిల్లల వైద్యుడు మెరుగైన వైద్యం అందించాల్సి ఉందని ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. గురువారం రాత్రి జ్వరం తీవ్రత ఎక్కువగా పెరగడంతో బాలుడు తట్టుకోలేక పోయాడని తల్లిదండ్రులు వాపోయారు. బాలుడి పరిస్థితి విషమంగా మారుతుండటంతో ఆందోళన చెంది డాక్టర్‌కు ఫోన్‌చేసినా పట్టించుకోలేదని, ఆస్పత్రి నర్సులతోనే వైద్యం చేయించడం, సకాలంలో మెరుగైన చికిత్స అందకా శుక్రవారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు రోధించారు. ఆస్పత్రి వైద్యుడు సకాలంలో స్పందించి తమ కుమారిడికి అవసరమైన వైద్యం అందించి ఉంటే ఇలా జరిగేది కాదని కన్నీటిపర్యంతమయ్యారు. నిర్లక్షగా వ్యవహరించిన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుల తరుపు బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషం తెలుసుకున్న వన్‌టౌన్ ఎస్ఐ సైదిరెడ్డి తన సిబ్బందితో ఆస్పత్రికి చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం వైద్యుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాలుడి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అనంతరం బాలుడి మృతదేహాన్ని బంధువులు స్వగ్రామానికి తీసుకెళ్లి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

కేసీఆర్ పేరు తొలగించడం హేయమైన చర్య

- మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



కళాభారతి వద్ద నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిర్యాలగూడలో నిర్మించిన కళాభారతికి కేసీఆర్ పేరును తొలగించడం హేయమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పట్టణంలో కళాభారతి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వరంగల్‌లో తప్ప కేసీఆర్ కళాభారతి ఆడిటోరియం మరెక్కడ లేదని, బీఆర్ఎస్ హయాంలో రూ.10కోట్లతో పట్టణంలో కేసీఆర్ కళాభారతిని అన్ని హంగులతో మిర్యాలగూడ నియోజకవర్గంలోని కవులు, కళాకారులు, సాంస్కృతికపరులకు, ప్రజలకు ఉపయోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ×అధికారంలో ఉన్నాం మారుస్తాం, తొలగిస్తాం అనుకుంటే మిర్యాలగూడ పేరును పిడుగురాళ్ల, దాచేపల్లిగా మార్చుకోండి¶ అని భాస్కర్‌రావు ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కట్టించారని, ఇప్పుడు మీరు ఖాళీ చేస్తారా అని ప్రశ్నించారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌లో ఇసుక, కంకర మాఫియా చెలాయిస్తున్నారని ఆరోపించారు. రూ.2కోట్లతో షాదీఖానా నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించి నిర్మించేందుకు శంకుస్థాపన చేశానని, ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదని ఆరోపించారు. అనంతరం కేసీఆర్ కళాభారతిగా పేరు ఉంచాలని కోరుతూ మున్సిపల్, సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఇలియాస్‌ఖాన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌యాదవ్, సాధినేని శ్రీనివాస్, సైదులుయాదవ్, షోయబ్, గయాస్, హబీబ్, మస్తాన్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

త్రిపురారం : సమాజంలో బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని త్రిపురారం మండల వైద్యాధికారి డాక్టర్ సంజయ్, అశ్విత సంస్థ కమ్యూనిటీ సోషల్ వర్కర్ కవిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అశ్విత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో ప్రజలకు బాల్య వివాహల వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18ఏళ్ల లోపు ఆడ పిల్లలకు, 21ఏళ్ల లోపు మగ పిల్లలకు బాల్య వివాహాలు చేయడం చట్టరీత్య నేరమన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు బాధ్యతగా కృషి చేయాలన్నారు. చిన్న వయస్సులో వివాహం వల్ల శారీరక మానసిక సమస్యలు తలెత్తుతాయన్నారు. చిన్న వయసులో గర్భందాల్చడం వల్ల బరువు తక్కువ పిల్లలు పుట్టడంతో పాటుగా రక్తహీనత కలిగి ఉండి అనార్థాలు చోటుచేసుకుంటాయన్నారు. అనంతరం బాల్య విముక్తి భారత్ అంటు నినాదాలు చేస్తు ప్రతిజ్ఞ చేయించారజ్ఞీ కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకయ్య, సూపర్ వైజర్ వెంకట్, ఏఎన్ఎమ్ కమల, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు

పెద్దవూర : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ తరి రాములు అన్నారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన మండలంలోని నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌వీఆర్ మోడల్ స్కూల్ హెచ్ఎం శేషును శుక్రవారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో శాలువాతో ఘనంగా సత్కరించి మాట్లాడారు. పాఠశాలలో 46మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షకు హాజరుకాగా 46మంది విద్యార్థులు ఉత్తీర్ణులై నూరుశాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థి 538 మార్కులు సాధించి మున్సిపాలిటీలో టాపర్‌గా నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సహదేవి, గగనేశ్వరి, సీఆర్‌పీ రమ్య పాల్గొన్నారు.

దేశంలో ధర్మ ప్రతిష్ఠాపనకు నడుంబిగించాలి

మిర్యాలగూడ టౌన్ : భారత దేశంలో ధర్మ ప్రతిష్ఠాపనకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని మిర్యాలగూడ అర్చక పురోహిత సమాఖ్య ముఖ్య సలహాదారులు పులి కృష్ణమూర్తి, కన్వీనర్ కుర్మెటి రాధాకృష్ణ శర్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శివాలయంలో జరిగిన శ్రీజగద్గురు శంకరాచార్య, శ్రీరామానుజచార్య స్వామివార్ల జయంతోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. అదే విధంగా వేద అభ్యసం చేస్తున్న విద్యార్థులకు శాలువాలతో గాయత్రి మాత చిత్రపటాన్ని బహూకరించారు. కాగా జర్నలిజం రంగంలో విశేష సేవలు అందిస్తున్న వెంకటరమణశర్మ, సుమన్, రామకృష్ణారావు, రవికుమార్, శ్రీనివాస్ శర్మలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పూర్ణయ్యశర్మ, నాగేందర్ శర్మ, లక్ష్మీనారాయణశర్మ, శంకర్ శర్మ, మహేష్‌శర్మ, సతీష్ శర్మ, యశ్వంత్ శర్మ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి తహసీల్దార్‌గా నరేందర్



కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి నూతన తహసీల్దార్‌గా ఎం. నరేందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండమల్లేపల్లిలో భూ సమస్యలు, రెవెన్యూ సంబంధమైన సమస్యల పరిష్కారానికి తనవంతు కర్తవ్యంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. కాగా ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన అన్వర్ హుస్సేన్ అడవిదేవులపల్లికి బదిలీ అయ్యారు.

గుర్రంపోడు తహసీల్దార్‌గా పి.శ్రీనివాస్



గుర్రంపోడు : గుర్రంపోడు మండల తహసీల్దార్‌గా పి. శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నల్లగొండ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన జి. కిరణ్‌కుమార్ ఫిబ్రవరిలో సస్పెన్షన్ కావడంతో అప్పటి నుంచి డిప్యూటీ తహసీల్దార్ ఎండీ ఫరీదుద్దీన్ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ బాధ్యతల నిర్వహణలో అందరూ సహకరించాలని కోరారు. తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్ పి. శ్రీనివాస్, సర్వేయర్ రాంనర్సయ్య, ఆర్ఎస్ఐ హాకీం, ఏఎస్ఐ సాలయ్య, జూనియర్ అసిస్టెంట్ సందీప్, వెంకటకృష్ణ, గోవర్ధన్, యాదగిరి, నరేష్, శివ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మిర్యాలగూడ : నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



పెద్దవూర జెడ్పీహెచ్ఎస్‌లో..

మిర్యాలగూడ : అడవిదేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకోని తమ గత స్మృతులను గుర్తు చేసుకోని ఆహ్లాదంగా గడిపారు. ఇక నుంచి అడవిదేవులపల్లి జెడ్పీహైస్కూల్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తానని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు డి.లక్ష్మీనారాయణ ప్రకటించారు. అనంతరం అప్పటి ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం వై.నాగేశ్వర్‌రావు, నాటి ఫిజికల్ డైరెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి, గెజిటెడ్ హెచ్ఎం జి.రామ్మోహన్, పూర్వ విద్యార్థులు వెంపటి కరుణాకర్, గందె ప్రసాద్, చెన్నబోయిన గురవయ్య, నీలకంతం సాంబయ్య, శ్రీపాద శ్రీనివాసచారి, జి.పుష్పలత, చెవిటి సైదయ్య, సుమన్, దస్రునాయక్, హరి, నాగానాయక్, హరనాద్‌రెడ్డి, రామాచారి, సాంబశివారెడ్డి, విజయలక్ష్మీ, లత, శైలజ, లక్ష్మీపార్వతి తదితరులు పాల్గొన్నారు.

14ఏళ్ల తరువాత ఒకే వేదికపై..

పెద్దవూర : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011-12 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల శుక్రవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా 14ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. బాల్య మిత్రులంతా ఒక్క చోట చేరడంతో అందరూ చిన్నపిల్లలుగా మారి సందడి చేశారు. ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అపురూప క్షణాలను సెల్‌ఫోన్లలో బంధించుకున్నారు. అనంతరం నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికలను అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాటి హెచ్ఎం వడ్లపల్లి నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు కూన్‌రెడ్డి విజయారెడ్డి, వెంకన్న, రామకృష్ణ, రామకోటయ్య, ప్రభాకర్, సునిత, రాంబాయి, సైదులు, ప్రశాంత్, నాటి విద్యార్థులు ఊరె ఆంజనేయులు, శివకుమార్, హరిబాబు, పుష్పలత, ప్రియాంక, అజయ్‌కుమార్, హరిబాబు, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల పరిశీలన

నాగార్జునసాగర్ : ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల సరిహద్దు చెక్‌పోస్టును శుక్రవారం పెద్దవూర తహసీల్దార్ శ్రీనివాస్, సాగర్ సీఐ శ్రీను నాయక్ పరిశీలించారు. కొంత కాలంగా ఆంధ్ర ప్రాంతం నుంచి ధాన్యం తెలంగాణ ప్రాంతానికి రవాణా కాకుండా కొత్త బ్రిడ్జి వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఆంధ్ర ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ధాన్యం రవాణ చేసే వానాలను తెలంగాణలోకి అనుమతించొద్దన్నారు. చెక్‌పోస్టులో విధులు నిర్వర్తించే సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీరితో పాటు ఎస్ఐ సంపత్ గౌడ్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న అధికారులు

కొండమల్లేపల్లిలో గాలివాన బీభత్సం



కొండమల్లేపల్లిలో కూలిన విద్యుత్ స్తంభం

కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రంలో శుక్రవారం సాయంత్రం కురిసిన గాలి వానకు పలు రకాల ఆస్తి నష్టం జరిగింది. స్థానికంగా నల్లగొండ వైపు వెళ్లే రోడ్డులోని పాత ఊరిలో విద్యుత్ స్తంభం కూలి ఓ ఇంటి ప్రహరీ గో కూలింది. అదేవిధంగా అబ్బనబోయినగుడెంలో యాదయ్య రైతు పొలంలో దొండ తోటపై వేప చెట్టు కూలడంతో దొండ పందిరి ధ్వంసమైంది. దీంతో రైతుకు దాదాపు రూ. 6లక్షల వరకు నష్టం జరిగిందని పేర్కొన్నాడు. స్థానిక సాగర్ రోడ్డులో శ్రీ సాయి శ్రీనివాస ఇంజనీరింగ్ వర్క్స్ మేకానిక్ షాపు రేకులు కూడా ధ్వంసమయ్యాయి.